

అవ్వ తాతలకు అన్యాయం

కర్నూలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన 70 ఏళ్ల రమీజాబికి గత పదేళ్లుగా వృద్ధాప్య పింఛను వస్తోంది. జగన్ ప్రభుత్వం వచ్చాక కూడా నాలుగేళ్లు పింఛను తీసుకుంది. అయితే.. ఆమె మనవడు బతుకుదెరువు కోసం ఓ సెకండ్ హ్యాండ్ కారు కొన్నాడు. అంతే.. కారు ఉందనే సాకు చూపి పింఛను రద్దు చేశారు. సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం.

● ఆదోని పట్టణం కార్వన్ పేటలో ఉంటున్న ఓ మహిళకు టీడీపీ ప్రభుత్వం హయాంలో వితంతు పింఛన్ మంజూరు చేశారు. ఒంటరి మహిళ కావడంతో దగ్గరి బంధువుల ఇంట్లో ఉంటూ.. ఆ కుటుంబ సభ్యుల రేషన్‌కార్డులోనే పేరు నమోదు చేసుకుంది. ఆ ఇంట్లో ఒకరు హోంగార్డు పని చేస్తున్నారని కొర్రీ పెట్టి ఆమెకు వస్తున్న వితంతు పింఛన్‌కు కోత పెట్టారు.

ఇలా వివిధ కొర్రీలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో జగన్ ప్రభుత్వం 25-30 వేలకు పైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్లు రద్దు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం రాగానే అవ్వ తాతల పింఛన్ రూ.3 వేలకు పెంచుతానంటూ గొప్పలు చెప్పుకున్న వైఎస్ జగన్ అధికారం చేపట్టగానే దశల వారిగా అంటూ మాయ చేసి మోసం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ అధికారం చేపట్టిన సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారుగా 2.75 లక్షల పింఛన్లు ఉన్నాయి. 2019 ఫిబ్రవరి నాటికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 3.93 లక్షలకు పెంచారు. అంటే.. ఆనాటి చంద్రబాబు ప్రభుత్వంలో కొత్తగా 1.18 లక్షల మంది పింఛన్లు ఇచ్చారు. ఈ నెల ఒకటో తారీఖున పంపిణీ చేసిన పింఛన్ల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 4.69 లక్షల పింఛన్లు ఉన్నాయి. అంటే.. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో పెరిగినవి 76 వేలే. అందులోనూ సగం వివిధ కొర్రీలతో రద్దు చేసినవే అని, ఇది మోసం కాదా..? అని ప్రతిపక్షాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం విభజిత ఏపీ తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 2014 జూన్ 8న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, 54 మండలాల పరిధిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, అభయ హస్తం.. ఇలా వివిధ కేటగిరిల కింద 2.75 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లు ఇచ్చేవారని అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి నెలా రూ.200 మాత్రమే ఇచ్చేవారు. అయితే.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ భరోసా పింఛన్లుగా పేరు మార్చి ఐదు రెట్లు పెంచి రూ.1,000 చేశారు. దీంతో పింఛన్లకు డిమాండ్ పెరిగింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు చేస్తూ వచ్చారు. 2016 మే నాటికి 3.09 లక్షలకు చేరాయి. రెండేళ్లలోనే 34-35 వేలు కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. 2019 జనవరిలో పింఛన్‌ను చంద్రబాబు ప్రభుత్వం రూ.2 వేలకు పెంచింది. జనవరిలో పెంచిన రూ.వెయ్యితో కలిపి ఫిబ్రవరిలో రూ.3 వేలు ఇచ్చారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పింఛన్లు 3.93 లక్షలు. అంటే.. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 1.18 లక్షలు కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు అధికారిక రికార్డులు ద్వారా తెలుస్తోంది. అంటే.. 30.02 శాతం పెరిగాయి. అంతేకాదు.. 2014 జూన్ 8వ తేదీకి ముందు ఇస్తున్న పింఛన్ రూ.200లే. దానిని టీడీపీ ప్రభుత్వం రూ2 వేలకు పెంచింది.

● రాష్ట్ర విభజన తరువాత ఉమ్మడి జిల్లాలో వివిధ పింఛన్లు 2.75 లక్షలు
● 2019 ఫిబ్రవరి నాటికి ఎన్టీఆర్ పింఛన్లు 3.93 లక్షలు
● కొత్తగా 1.18 లక్షల మందికి సామాజిక భద్రత
● ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 4.69 లక్షల పింఛన్లు
● ఈ ఐదేళ్లలో పెరిగినవి 76 వేలే..
● వివిధ కారణాలతో 30-35 వేల మందికి కోత
● వారి స్థానంలో కొత్తగా ఇచ్చినట్లు బిల్డప్ ఇస్తున్న వైసీపీ ప్రభుత్వం



అవ్వతాతలకు రూ.950 కోట్లు ఎగనామం:

2019 జనవరిలో అవ్వతాతల పింఛన్ రూ.2 వేలకు పెంచిన ఆనాటి సీఎం చంద్రబాబు రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.3 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. అదే సమయంలో ప్రతిపక్ష నాయకుడు జగన్ కూడా పింఛన్ రూ.3 వేలు చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. అయితే.. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. వైసీపీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టారు. అధికారం రాగానే విడతల వారిగా రూ.3 వేల వరకు పెంచుతూ పోతా అని మాట మార్చి మాయ చేశారు. అదే టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే రూ.3 వేలకు పెరిగేది. జగన్ మాట మార్చడం వల్ల తొలి ఏడాది నెలకు రూ.750 ప్రకారం రూ.9 వేలు, రెండు ఏడాది నెలకు రూ.500 ప్రకారం రెండేళ్ల రూ.12 వేలు, చివరి ఏడాది నెలకు రూ.250 ప్రకారం రూ.3 వేల చొప్పున ప్రతి పింఛనుదారుడు ఈ ఐదేళ్లలో దాదాపు రూ.24 వేలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ లెక్కన 2019 ఫిబ్రవరిలో ఉన్న పింఛన్ల లెక్క ప్రకారమే అవ్వతాతలు పింఛన్ రూపంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.950 కోట్లు నష్టపోయారని అంచనా. ఇది వంచన కాదా అని ప్రశ్నిస్తున్నారు.

● కొర్రీలు.. కోతలు..

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా 2019 మే 30న బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నేటికి ఉమ్మడి జిల్లాలో 3.93 లక్షలకు పైగా వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. ఈ నెల పంపిణీ చేసిన పింఛన్ల వివరాలు పరిశీలిస్తే.. కర్నూలు జిల్లాలో 2.45 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.24 లక్షలు కలిపి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4.69 లక్షల సామాజిక భద్రతా పింఛన్లు ఉన్నాయి. అంటే.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో పెరిగిన పింఛన్ల సంఖ్య 76 వేలు మాత్రమే. అంటే.. 16.41 శాతం పెరిగాయి. 2014 జూన్ 8కి ముందు ఉన్న పింఛన్ల సంఖ్యతో పోలిస్తే 2019 ఫిబ్రవరి నాటికి చంద్రబాబు ప్రభుత్వంలో 30.02 శాతం పెరిగాయి. ఈ లెక్కన చూస్తే జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో 5.10 లక్షలకు చేరి ఉండాలని అంటున్నారు. ప్రస్తుతం ఉన్నది 4.69 లక్షలే. అంటే.. దాదాపు 35-40 వేల మందికి అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వలేదని తెలుస్తుంది. అంతేకాదు.. ఇంట్లో ఒకరికే పింఛను, పది ఎకరాలు పొలం, నాలుగు చక్రాల వాహనం ఉన్నా, ఇంట్లో ఎవరైనా ఆదాయ పన్ను చెల్లిస్తున్నా, 300 యూనిట్లకు పైగా కరెంట్ బిల్లు కడుతున్నా.. ఇలాంటి 11 రకాల కొర్రీలు పెట్టి టీడీపీ ప్రభుత్వంలో ఇస్తున్న పింఛన్ కూడా రద్దు చేశారు. ఆ స్థానంలో కొత్త వారికి పింఛను మంజూరు చేసి తామేదో ఉద్ధరించినట్లు వైసీపీ సర్కారు బిల్డప్ ఇస్తోందని, కొర్రీలతో కోతలు అవ్వతాతలను జగన్ వంచించాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆరోపించారు.



ఈమె చేసిన పాపమేంటి..?

ఈమె పేరు పింజరి రంజానమ్మ, కోసిగి మండలం డి.బెళగల్ గ్రామం. రెక్కాడితే గాని పూట గడవని నిరుపేద కూలీ కుటుంబం. ముగ్గురు పిల్లలు ఉన్నారు. రంజానమ్మ భర్త పీరుసాబ్ అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృత్యువాత పడ్డారు. ఆ రోజు నుంచి గ్రామ సచివాలయంలో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నారు. ఐదేళ్లు కావస్తున్నా పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. ఇదేమని అడిగితే సరైనా సమధానం లేదు. వలంటీర్లే మీ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ దరఖాస్తులు పూర్తి చేస్తారని, వచ్చే నెల నుంచి పింఛన్ ఇస్తారని సీఎం జగన్ గొప్పగా చెబుతున్నారు. ఈ అభాగ్యురాలు ఐదేళ్లుగా పింఛన్ రాక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా కనికరించేవారు లేరు.



30 ఏళ్లుగా వస్తున్న పింఛన్ రద్దు చేశారు

ఈ వృద్ధురాలి పేరు పరుశగేరి రామక్క. మండల కేంద్రం కోసిగిలో 2వ వార్డులో నివాసం ఉంటోంది. 30 ఏళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఈమేకు వితంతు పింఛన్ మంజూరైంది. 30 ఏళ్లుగా పింఛన్ అందుకుంటోంది. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏ ఇబ్బంది రాలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక కూడా ఏడాది వరకు ఐడీ నెంబరు 113330765 కింద పింఛన్ అందుకుంది. వైసీపీ ప్రభుత్వం ఈమెకు 11 ఎకరాల పొలం ఉందని కొర్రీ పెట్టి మూడు దశాబ్దాలుగా వస్తున్న పింఛన్‌ను రద్దు చేసింది. వాస్తవంగా ఆమెకు ఉన్నది ఎకరాల పొలమే. నాకు పింఛన్ ఇస్తారా..? 11 ఎకరాల పొలం చూపిస్తారా..? అని నాలుగు ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరు.



2019 ఫిబ్రవరి నాటికి ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

కేటగిరి	పింఛన్‌దారులు
వృద్ధాప్య పింఛన్	1,62,497
వితంతువులు	1,63,764
వికలాంగులు	47,777
చేనేత కార్మికులు	4,621
కల్లుగీత కార్మికులు	344
అభయ హస్తం	3,589
ఒంటరి మహిళ	4,993
మత్స్యకారులు	1,320
ట్రాన్స్‌జండర్	318
డప్పు కళాకారులు	2,352
డయాలసిస్	123
ట్రడిషనల్ కాబ్లర్స్	1,272
మొత్తం	**3,92,968**

అన్నదాతల ఆగ్రహం

● నాసిరకం విత్తనాల అమ్మకాలపై వాగ్వాదం
● దుకాణం ముందు బైఠాయింపు
● మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



విత్తనాల దుకాణం ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, రైతులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 4: నాసిరకం విత్తనాల అమ్మకాలపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తనాలు విక్రయించిన దుకాణం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. వ్యాపారిపై చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరి ఆందోళనకు టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డితోపాటు పెద్దకడుబూరు మండల రైతులు, టీడీపీ కార్యకర్తలు మద్దతు పలికారు. మండల కేంద్రమైన పెద్దడుబూరుకు చెందిన రైతులు శ్రీనివాసులు, క్రాంతికుమార్ పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న గణేష్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో కలంగడ విత్తనాలను కొనుగోలు చేశారు. శ్రీనివాసులు 2.50 ఎకరాలకు గాను రూ.9వేలు, క్రాంతికుమార్ ఎకరా పొలంలో సాగుచేసేందుకు రూ.4,200 వెచ్చించి కలంగడ విత్తనాలను కొనుగోలు చేశారు. అయితే పంట చేతికి వచ్చే సమయానికి కూడా కాయ సైజు పెరగలేదు. దీంతో అనుమానం వచ్చిన రైతులు వెంటనే విత్తనాలు ఇచ్చిన డీలర్, వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు పంటను పరిశీలించి ప్రధాన డీలర్‌కు సమాచారం అందిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఎన్నిసార్లు వీరి దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో ఆదివారం తోటి రైతులతో కలిసి ఎమ్మిగనూరు పట్టణంలోని విత్తనాలు కొనుగోలు చేసిన గణేష్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణం ముందు బైఠాయించారు. పరిహారం ఇవ్వాలని, నాసిరకం విత్తనాలు అమ్మిన వ్యాపారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక నష్ట పరిహారం ఇచ్చే వరకు దుకాణాన్ని మూయాలని రైతులు ఆందోళనకు దిగి షెట్టర్లను కిందికి లాగేందుకు ప్రయత్నించారు. దీంతో వ్యాపారులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిహారం ఇచ్చే వరకు కదిలేదిలేదంటూ రైతులు బలవంతంగా దుకాణం షెట్టర్‌ను మూసి వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణం దగ్గరకు చేరుకొని రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. దుకాణాదారుడిని, రైతులను పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. వ్యాపారులు వెళ్లిన కొద్ది సేపటికే రైతులు నినాదాలు చేస్తూ ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ పోలీస్ అధికారులు ఫిర్యాదు చేయాలని సూచించడంతో తమకు నష్ట పరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళనను విరమించేదిలేదని దుకాణం వద్దకు చేరుకున్నారు. రాత్రి వరకు దుకాణం ముందే బైఠాయించారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి అన్నారు. ఆందోళనలో రైతులు యేసేపు, ఆంజనేయులు, నరసన్న, రాము, జైపాల్, బజారప్ప, సందీప్, కిరణ్, బాషా, రంగన్న పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న రైతులు

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం

● మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి
● పుసులూరులో టీడీపీ ఆత్మీయ సమావేశం

కల్లూరు, ఫిబ్రవరి 4: ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పుసులూరు పల్లె ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన టీడీపీ ఆత్మీయ సమావేశానికి మాండ్ర శివానందరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, టీజీ భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పల్లె ప్రభాకర్‌రెడ్డి నివాసం నుంచి దాదాపు ఐదు వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించి గౌరు దంపతుల సమక్షంలో టీడీపీ జెండా ఆవిష్కరించారు. ఆత్మీయ సమావేశానికి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై అభిమాన నాయకులపై పూలవర్షం కురిపించారు. పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పుసులూరు, లొద్దిపల్లె, రేమడూరు, యాపర్లపాడు, బొల్లవరం, పెద్దపాడు నుంచి డిప్యూటీ మేయర్ ముఖ్య అనుచరుడు మల్లికార్జునతోపాటు దాదాపు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కోట్ల, గౌరు, బీసీ, మాండ్ర టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కోట్ల మాట్లాడుతూ జిల్లాలో జగన్ ప్రాజెక్టులను గాలికొదిలేశారని నీటిని స్టోరేజీ చేసుకునే అవకాశం లేకుండా పోయిందని ఆరోపించారు. తుంగభద్ర, హంద్రీనదిలో ఇసుకను వైసీపీ నేతలు అక్రమంగా తరలిస్తున్నారని విమర్శించారు. దీంతో సాగునీరందక పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె టీడీపీ ఇన్‌చార్జి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 65 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని వైసీపీ ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ టీడీపీలోకి వలసలు చూసి అధికార పార్టీలో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే అనుచరవర్గం పేదలు, అమాయకుల పొలాలు, స్థలాలు కబ్జా చేస్తోందని విమర్శించారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ అధినేత ప్రవేశ పెట్టిన ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ అందరినీ వాడుకుని వదిలేసే రకం అన్నారు. కార్యక్రమంలో కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, చంద్రకళాధర్‌రెడ్డి, పద్మలతారెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డి.రామాంజనేయులు, ఈవీ రమణ, జనసేన నాయకుడు చింతా సురేష్ కాసాని మహేష్‌గౌడ్, వాకిటి మాదేష్ టీడీపీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కోట్ల

క్వింటం ఎండు మిరప రూ.22 వేలు

వారంలో రూ.3 వేలు తగ్గిన ధర

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 4: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఎండుమిరప ధర బ్యాడిగి రకం క్వింటాలు గరిష్ఠంగా రూ.22 వేలు పలికింది. గతవారంతో పోల్చితే క్వింటానికి రూ.3వేలకు పైగా ధర తగ్గింది. తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ ఏడాది మిరప పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని, ధర కూడా తగ్గడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేజా రకం ఎండు మిరప ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.19,311, లాలి లాలి రకం మిరప రూ.14,511, డీడీ రకం రూ.15,011, సూపర్ 10 రకం మిరప రూ.17,550 పలికింది. ఆదివారం



మొత్తం 2103 బస్తాల ఎండుమిరపను రైతులు విక్రయానికి తీసుకోరాగా, వాటి కనిష్ఠ ధర క్వింటాలు రూ.4,611, గరిష్ఠ ధర రూ.22వేలు మధ్యస్థ ధర రూ.15,300 పలికింది.

అక్రమ కట్టడాల జోరు

- ప్లాను లేకుండానే నిర్మాణాలు
- పుర ఆదాయానికి రూ.కోట్లలో గండి



మట్కార్ వీధిలోని ఇరుకు సందు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 4 : ఇరుకు సందుల్లోని ఇళ్ల నిర్మాణాల ప్లాను మంజూరుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్లాను మంజూరు లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫలితంగా రూ.కోట్లలో మున్సిపాలిటీల ఆదాయానికి గండి పడుతోంది. ఇరుకు సందులలో ప్లానుల మంజూరుకు ప్రభుత్వం వెసులుబాటును కల్పించినా ఆ దిశగా పుర అధికారులు చర్యలు తీసుకవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవో నెం. 119 ప్రకారం 30 అడుగుల రోడ్డు ఉంటేనే ప్లాను మంజరుకు అవకాశం ఉంటుంది. పాత పట్టణ ప్రాంతాల్లో ఐదు నుంచి పది అడుగుల వెడల్పుతో చిన్నపాటి సందులే అధికంగా ఉండడంతో ఈ జీవో ప్రకారం ప్లాన్ మంజూరుకు అవకాశం లేదు. ఒకవేళ ప్లాను మంజూరు చేసుకోవాలంటే నిర్మాణదారుడు మునిసిపాలిటీకి అవసరమైన స్థలం సొంత ఖర్చులతో రిజిస్టర్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. పాత పట్టణ ప్రాంతాల్లో చిన్నపాటి స్థలాలు ఉండటం, అందులో పేద కుటుంబాలే అధికంగా నివసిస్తుండడంతో రహదారి విస్తరణ కోసం తమ స్థలాన్ని మున్సిపాలిటీలకు ఉచితంగా ఇవ్వడానికి నిర్మాణదారులు ఇష్టపడటం లేదు. స్థానిక చోటా నాయకుల సహకారంతోనో, సచివాలయ వార్డు ప్లానర్లకు లంచాలు ముట్టజెప్పడంతోనో ప్లాను మంజూరు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

హౌసింగ్ రుణాలు అభించని పరిస్థితి

ఇరుకు సందులలో ప్లాను మంజూరుకు అవకాశం లేకపోవడంతో బ్యాంకులలో హౌసింగ్ రుణాలు లభించే పరిస్థితి లేకుండా పోతోంది. బ్యాంకు రుణాల కోసం అర్హత ఉండి, ప్లాను అభించని కారణంగా, అప్పులు చేసి అక్రమ నిర్మాణాలను చేసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.



ఇరుకు సందులో జరుగుతున్న అనధికార కట్టడం

పుర ఆదాయానికి రూ.కోట్లలో గండి

జిల్లాలోని మున్సిపాలిటీలలో గతంతో పోలిస్తే ప్లానుల మంజూరు సంఖ్య దాదాపు 80 శాతం తగ్గిపోవడంతో రూ.కోట్లలో పుర ఆదాయానికి గండి పడినట్లు తెలుస్తోంది. 2023 కర్నూల్ కార్పొరేషన్‌లో 1591, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 480, ఆదోని మున్సిపాలిటీలో 280 ప్లానులు మాత్రమే మంజూరయ్యాయి. గతంలో మంజూరైన ప్లానులతో పోలిస్తే జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ.75 నుంచి రూ.80 కోట్ల దాకా ఆదాయానికి గండి పడినట్లు తెలుస్తోంది.

పూర్తి కాని సర్క్యులేషన్ ప్యాటర్న్...

పాత పట్టణాలలో ప్లానుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడం గమనించిన ప్రభుత్వం చిన్నపాటి సందులలో కూడా సులభంగా ప్లానుల మంజూరు కోసం ఒక వెసులుబాటును ప్రకటించింది. ఇరుకుగా ఉండే రోడ్డుకు సంబంధించిన ప్లాన్లను (సర్క్యులేషన్ ప్యాట్రన్) రూపొందించి స్థానిక మునిసిపల్ కౌన్సిల్ అనుమతితో ప్రభుత్వానికి పంపిస్తే ఆయా ప్రాంతాల్లో ప్లాన్ మంజూరుకు ప్రత్యేక జీవో ఇచ్చే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఏ ఒక్క మునిసిపాలిటీలో కూడా ఇంతవరకు ఒక్క సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్ కూడా మంజూరుకు నోచుకోలేదు. ఫలితంగా ఇరుకు సందులలో అక్రమ నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి వార్డుకు ఒక సచివాలయం, తగిన సిబ్బంది ఉన్నా వాటిని రూపొందించి ప్రభుత్వానికి పంపడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉంది

పాత పట్టణ పరిధిలోని 10 ఇరుకు సందులకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్‌ను ఆర్డీటీకి పంపాం. త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది. మిగిలిన అన్ని ఇరుకు సందులకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లానును కూడా పంపించనున్నాం. ప్లాను లేకుండా జరిగే నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తున్నాం.

-శ్రీనివాసులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఆదోని

శ్రీకాకుళంకు మాత్రమే ప్రత్యేక జీవో

రాష్ట్రంలో ఒక్క శ్రీకాకుళం పట్టణంలోని పాత బస్తీలో ఉన్న 30 ఇరుకు ప్రాంతాలకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్లు రూపొందించగా అందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లాలో ఏ మున్సిపాలిటీలో కూడా ఒక్క సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లాన్లు రూపొందించి ప్రభుత్వ అనుమతి పొందిన దాఖలాలు లేవు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ఉన్న ఇరుకు సందులకు సంబంధించిన సర్క్యులేషన్ ప్యాటర్న్ ప్లానులను రూపొందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఫిబ్రవరి 4. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. రథోత్సవాలలో భక్తులు పాల్గొని ఆశీస్సులు పొందారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు

ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం మాఘమాసం పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలును ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సినీ నటుడు



మంత్రాలయంలో సినీ నటుడు మధుసూదన్, నిర్మాత బాలాజీ

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం ప్రముఖ సినీ నటుడు మధుసూదన్, సినీ నిర్మాత బాలాజీ బృందం ఆదివారం మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గోరుకల్లు కృష్ణ, వ్యాసరాజాచార్, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

23 సార్లు రక్తదానం



23వ సారి రక్తదానం చేస్తున్న ఉప్పలపాటి అర్జున్

కోసిగి, ఫిబ్రవరి 4: ఒకటి కాదు.. రెండు కాదు.. 23 సార్లు అవసరమైన వారి దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్లి ఉప్పలపాటి అర్జున్ రక్తదానం చేస్తున్నాడు. మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన అర్జున్ ఇప్పటి వరకు గర్భిణులకు, బాలింతలకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి 23 సార్లు రక్తదానం చేశాడు. ఆదివారం కూడా అదే గ్రామానికి చెందిన చాగి హారిక అనే 9 నెలల గర్భిణికి కాన్పు సమయంలో రక్తం తక్కువగా ఉందని 23వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నాడు.

రూ.13 లక్షల నగదు పట్టివేత



పట్టు బడ్డ నగదును చూపుతున్న ఎస్సై, తహసీల్దార్

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 4 : బ్రాహ్మణకొట్కూరు వద్ద గల అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద రూ.13 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. డోన్‌కు చెందిన శ్రీనివాస్ గౌడు అనే వ్యక్తి వద్ద రూ.13 లక్షల నగదు లభ్యమైంది. వాటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తన కారులో తీసుకుని పోతుండగా సీజ్ చేసినట్లు తెలిపారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంట్‌కు పంపించామన్నారు. నందికొట్కూరు డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున, సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ యువ నాయకుడి మృతి



లాలప్ప(ఫైల్)

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 4: తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కంబాలపాడు గ్రామానికి చెందిన లాలప్ప (38) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. తెలుగు యువత నాయకుడు కేఈ వేణుబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి లాలప్ప ఎంతగానో కృషి చేసాడని, వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

'రైతులంతా ఏకం కావాలి'



రాయలసీమ రక్ష పుస్తకావిష్కరణ చేస్తున్న బొజ్జా దశరథ రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

చాగలమర్రి, ఫిబ్రవరి 4: రైతులంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాజోలి గ్రామ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందిస్తే మంచిదని అన్నారు. సాగునీటి జలాలు ఉన్న వాటిని ఒడిసి పట్టేందుకు ఈ ప్రాంత రైతాంగానికి కావాల్సిన రిజర్వాయర్లను నిర్మించలేదని అన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నా వాటిని అన్వేషించడం లేదని అన్నారు. పూడుకపోయిన కాలువలను బాగు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కుందూ నది వెడల్పు చేస్తూ కట్టలు వేయడం వల్ల పరివాహక రైతులకు ఇబ్బందులు తలత్తే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వర్షాలు వస్తే ఆ నీరు ఎక్కడకు మళ్లించాలని ప్రశ్నించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రైతులంతా ఐకమత్యమై తమ సమస్యలను పరిష్కరించేందుకు పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి, రాయలసీమ కార్మికుల సాధన సమితి అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్ రెడ్డి, మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే రోడ్డును తవ్వేసిన వలంటీరు



అడ్డంగా తవ్వేసిన రోడ్డు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని రెండో వార్డు బావాజీపేటలో మురికి నీటిపైపు ఏర్పాటు కోసం సిమెంట్ రోడ్డు మధ్యలో అడ్డంగా తవ్వేయడంపట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలనే వేసిన సిమెంట్ రోడ్డును అధికారుల అనుమతి లేకుండా సచివాలయ వలంటీర్ తవ్వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికార పక్ష నాయకులే కాకుండా వలంటీర్లు కూడా తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తుండటం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదులతో పురపాలక డీఈ నాగభూషణం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డు తవ్వకాల పనిని ఆపుచేయించారు. అయినా అధికారులు వెళ్లిన వెంటనే తిరిగి తవ్వకాల పనులు తిరిగి చేపట్టారు. ప్రజలకు ఉపయోగపడే రోడ్డును ఎమ్మెల్యే పేరును వాడుకుంటూ అడ్డంగా తవ్వేయడం పట్ల తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రచార కార్యదర్శి బోయ తిమ్మప్ప తీవ్రంగా విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఆలూరు, ఫిబ్రవరి 4: ఆలూరు మండలం హోలేబీడు గ్రామ శివారులో ఆదివారం మొయినుద్దీన్, గణేష్ అనే ఇద్దరు బాలురు సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా బళ్లారి నుంచి రాయచూరు వైపు వెళ్తున్న కేఏ35డీ3147 నెంబరు గల కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. మొయినుద్దీన్ (13) అనే బాలుడి పరిస్థితి విషమంగా మారింది. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణేష్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. కారును, డ్రైవర్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలశ యాత్రను ప్రారంభించిన టీజీ భరత్



కలశ యాత్రను ప్రారంభిస్తున్న టీజీ భరత్

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 4: పాత నగరంలోని చిన్న అమ్మవారిశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి కలశ యాత్రను ఆదివారం పాత నగరంలోని శ్రీ రాంభొట్ల దేవాలయం వద్ద టీడీపీ కర్నూలు నియోజిక వర్గం ఇన్‌చార్జి టీజీ భరత్ ప్రారంభించారు. అంతకు ముందు రాంభొట్ల దేవాలయంలో పూజలు చేశారు.

నేడు డీఐజీ బాధ్యతల స్వీకారం



డీఐజీకి బొకే ఇస్తున్న ఎస్పీ

కర్నూలు, ఫిబ్రవరి 4: కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరాం సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాకినాడు ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న ఆయన ఇటీవలె కర్నూలు రేంజ్ డీఐజీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలు బీ. క్యాంపులోని పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. కర్నూలు వచ్చిన ఈయనకు ఎస్పీ జి కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ విజయశేఖర్, సీఐలు నాగరాజు యాదవ్, మురళీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఉన్న డీఐజీ సెంథిల్ కుమార్ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ అయిన విషయం తెలిసిందే..

అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన



మౌన ప్రదర్శన చేస్తున్న రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాత బస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు మౌన ప్రదర్శన చేశారు. అంతకు ముందు జడ్పీలోని ఎంపీపీ సమావేశ హాలులో సంఘం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ డి. మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నూర్‌బాషా కులస్థులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మొహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే చట్ట సభల ఎన్నికల్లో నూర్‌బాషా, దూదేకుల కులం వారికి రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమకు సీట్లు కేటాయించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అక్కడ మౌన నిరసన పాటించారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా, దూదేకుల ముస్లి సంక్షేమ సంఘం ఉద్యోగ సంఘ నాయకుడు సిద్ధయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్ పాల్గొన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్ మృతి

బనగానపల్లె, ఫిబ్రవరి 4: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శ్రీనివాసులు (46) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పులివెందులకు చెందిన శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీ ట్యాంకర్‌తో బనగానపల్లె వైపు వెళ్తూ వెనుక నుంచి వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జయి డ్రైవర్ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు.. బైక్ సీజ్

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి 480 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తెస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కట్టుబడి మైనుద్దీన్ మోటారు సైకిల్‌పై 5 బాక్సుల్లో 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ విస్కీ 450 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా.. మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు అరెస్టు చేశారు. మద్యంతో పాటు బైక్‌ను సీజ్ చేసి కోర్టులో హాజరు పరచారు. ఆయనను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రెండు ఇళ్లలో దొంగతనం

సి. బెళగల్, ఫిబ్రవరి 4: మండలంలోని కంబందహాల్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఇండ్లలో దొంగతనాలు జరిగాయి. ఆ ఇండ్లలోని కుటుంబ సభ్యులు బంధువుల ఊరికి వెళ్లడం గమనించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఆ రెండు ఇళ్ల వారు ఆదివారం ఇంటికి వచ్చాక నగదు, బంగారం పోయినట్లు గుర్తించారు. వెంకటరామిరెడ్డి ఇంట్లో రూ.లక్ష, ఐదు తులాల బంగారం, ప్రతాప్‌రెడ్డి ఇంట్లో రూ.50 వేల నగదు, ఒకటిన్నర తులం బంగారం చోరీ జరిగింది. బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విష ఆహారం తిని శునకాల మృతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 4: కొత్తపల్లి మండలం జడ్‌వారిపల్లెలో సుమారు 40 శునకాలు మృతి చెందాయి. గ్రామంలోని గొర్రెలను కుక్కలు వెంటాడి చంపి తింటున్నట్లు గ్రామస్థులు చెప్పారు. దీంతో గ్రామంలోని కొందరు వ్యక్తులు చనిపోయిన గొర్రెల కళేబరంలో విషం కలిపారని, దీంతో ఆ మాంసం తిన్న కుక్కలు మరణించినట్లు తెలిపారు

డీఎస్సీ పేరుతో దగా

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 4: మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్ నిరుద్యోగులను దగా చేస్తున్నారని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం హుశేనాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానంటూ ప్రగల్బాలు పలికి నాలుగున్నరేళ్లుగా మీనమేషాలు లెక్కించి ఇప్పుడు మెగా డీఎస్సీ అంటూ దగా చేస్తున్నారని అన్నారు. రెండు నెలల్లో అధికారం నుంచి దిగిపోనున్న జగన్ ఉద్యోగాలు ఇచ్చేది నిజమేనా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డిని నిరుద్యోగ యువత నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచారని విమర్శించారు. చంద్రబాబు వస్తేనే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహబూబ్‌బాషా, నాయకులు కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, వేణు పాల్గొన్నారు.

గూడూరు: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసినది మెగా డీఎస్సీ కాదు .. దగా డీఎస్సీ అని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ధ్వజమెత్తారు. ఆదివారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ 50,892 ఖాళీలు ఉంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులని వంచించడమే అని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మన్నన్ బాషా, సుమన్ బాబు పాల్గొన్నారు.

టీడీఎల్పీలో బీటీ నాయుడు


టీడీఎల్పీ సమావేశంలో పాల్గొన్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 4: అమరావతి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన టీడీఎల్పీ సమావేశానికి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో చంద్రబుబుతోపాటు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, హిందూపూర్ ఎమ్మెల్సీ నందమూరి బాలక్రిష్ణ, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, ఎనమల రామక్రిష్ణుడు పాల్గొన్నారు. అనంతరం ప్రజాకోర్టు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

మగ్దూం మొహిద్దీన్‌కు నివాళి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4: రాష్ట్రోపాధ్యాయ సంఘం వ్యవస్థాపకుడు మగ్దూం మొహిద్దీన్ 117వ జయంతి సందర్భంగా స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదసిర్ అహ్మద్, మాజీ గౌరవ అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర మాజీ కన్వీనర్ షఫీ, పూర్వ ఆర్థిక కార్యదర్శి రాష్ట్ర కౌన్సిలర్ పాలయ్య, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ దేవదాసు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీధర్, గోవింద నాయక్ పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు

సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు


హంద్రీలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 4: నగరంలో దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో ఆదివారం యాంటీవైరల్ ఆపరేషన్‌లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని పాలు ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న చోట్ల, కాలువల్లో సిబ్బంది దోమల నివారణ మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి వార్డులో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయి స్తూ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో కలిసి దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. స్టాంటాన్‌పురం, శరీన్‌నగర్‌లోని పాఠశాల విద్యార్థులకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న లక్ష్మన్న

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 4: జిల్లాలో రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిత్తారి వీధి లక్ష్మన్న అన్నారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదురుగా నూతనంగా రజక భవన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ ఇప్పటి వరకు రజకుల కోసం ఎలాంటి కార్యాలయం లేదని, దానిని దృష్టిలో ఉంచుకుని నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. రజకులకు ఎలాంటి సమస్య వచ్చిన కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి రంగన్న, సంయుక్త కార్యదర్శి ఎం.ఎల్లయ్య, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 4: నగరంలోని రెండో వార్డు పెద్దమార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి ఫయాజ్, కార్పొరేటర్లు అబ్దుల్ లతీఫ్, విక్రమసింహారెడ్డి, సత్యనారాయణమ్మ, ఈఈలు శేషసాయి, షాకీర్, డీఈ గిరిరాజు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అండగా టీడీపీ: టీజీ


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 4: వాహనాల డ్రైవర్లకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లకు తగిన గుర్తింపు ఉండేలా డ్రైవర్స్ డేను ఏర్పాటు చేసేందుకు చంద్రబాబుతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లను తమ ప్రభుత్వం రాగానే పునరుద్ధరిస్తామన్నారు. ప్రమాదవశాత్తు డ్రైవర్లు చనిపోతే పరిహారం ఆ కుటుంబానికి అండగా ఉండాలన్న దానిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆలయాలు, పర్యాటక ప్రాంతాల్లో డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేసేందుకు విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. 50 ఏళ్లు దాటిన డ్రైవర్లకు ప్రభుత్వం పింఛన్ ఇచ్చే విషయంపై ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు పరిశీలిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యుడు అన్వర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోండి: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సూచించారు. ఆదివారం 8వ వార్డులో పెద్దపడఖానలో మదీన మెడికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యం కోసం గౌరిగోపాల్ హాస్పిటల్‌లో ఉచిత గుండె వైద్యపరీక్షలు చేయిస్తున్నామన్నారు. కరోనా తర్వాత గుండె జబ్బులు పెరిగిపోయిన నేపథ్యంలో తమ వైద్యశాలలో ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, జుబేర్, చేపల పరమేష్, కస్తూరి వెంకటేశ్వర్లు, నాగార్జున పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక : నగరంలోని 48 వార్డు రోజా వీధిలో టీడీపీ నాయకుడు దేవా ఆధ్వర్యంలో ఆదివారం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీజీ భరత్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజల ఆదాయం పెరగకున్నా ఖర్చులు మాత్రం భారీగా పెరిగాయని విమర్శించారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ ఓట్ల కోసం వైసీపీ నాయకులు వస్తున్నారని, అలాంటి వాళ్లను నమ్మవద్దని కోరారు. పార్టీలో చేరిన వారిలో ప్రభావతి, రేణుక, జంబావతి, అమాలమ్మ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు మన్సూర్ అలీఖాన్, టీడీపీ మహిళా అధ్యక్షురాలు మారుతి శర్మ, సౌభాగ్యవతి, నాయకులు శ్యామ్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో క్యాన్సర్‌ను ఎదుర్కొందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న పుల్లయ్య

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 4: ఆత్మ విశ్వాసంతో క్యాన్సర్‌ను ఎదుర్కొందామని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య, ఒమేగా హాస్పిటల్ డైరెక్టర్లు డా.వై.వెంకట్రామిరెడ్డి, డా.రవీంద్రబాబు, డా.సుధీర్, డా.యు ఉమ్మ మహేశ్వరరెడ్డి, డా.సుధీర్ రెడ్డి అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆదివారం ఒమేగా హాస్పిటల్ క్యాన్సర్ సొసైటీ ఆఫ్ కర్నూలు, రవీంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో నగరంలో విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సునాయసంగా జయించవచ్చన్నారు. కార్యక్రమంలో ఒమేగా హాస్పిటల్ సెంటర్ హెడ్ డా.ఆదిత్య పాల్గొన్నారు.

● **మెడికవర్‌లో:** వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అంకాలజిస్టు డా.రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోటి మందికి పైగా క్యాన్సర్‌తో మరణిస్తున్నారని, దేశంలో 11 లక్షల మందికి క్యాన్సర్ సోకినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం మద్యం, పొగతాగడం, అధిక బరువు, కాలుష్యం ఇన్‌ఫెక్షన్ల వల్ల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ పి.నీలారెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్: దేశంలో ఏటా 80 వేల మంది గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారని సర్జికల్ అంకాలజిస్టు డా.సి.వాసురెడ్డి తెలిపారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న వీఆర్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆయన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించి, రోగులకు ఉచిత పరీక్షలు చేశారు.

వైసీపీని గద్దెదించుదాం: గౌరు చరిత


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 4: రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుదామని పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జులు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం నెరవాడలో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో ఇంటింటికీ తిరిగి ప్రజలు సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరప త్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళ ఏడు నెలల వైసీపీ పాలనలో అవినీతి అక్రమాలు, దోపిడీ తప్ప అభివృద్ధి ఎక్కడా జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు జాఫర్, మొహమ్మద్‌అలీ, తిరుమలేష్, తిమ్మప్ప, మిన్నల్ల, విజయుడు, ఉసేనప్ప, డి.రామాంజనేయులు, వాకిటి మాదేస్, ఆర్.చంద్రకళా ధర్‌రెడ్డి, పల్లె.ప్రభాకర్‌రెడ్డి, పెద్ద బీచుపల్లి, చిన్న బీచుపల్లి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: కల్లూరు మండలం నెరవాడ గ్రామానికి చెందిన 30 కుటుంబాలు మాచిరెడ్డి కాంత్‌మోహన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం నెరవాడ బాబు ష్యూరి టీలో పాల్గొన్న గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక వైసీపీని వీడుతు న్నట్లు మాజీ సర్పంచు అల్లాబకాష్, లక్ష్మీరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, పి.మహేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, అల్లీపీరా, రత్నారెడ్డి, చిన్నహుసేన్,, నడిపి హుసేన్ స్పష్టం చేశారు. అలాగే ఏ.గోకులపాగు నుంచి వైసీపీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, శేఖర్‌రెడ్డి, సర్వేష్‌రెడ్డి, షబ్బీర్‌హుసేన్, షబ్బీర్‌బాషా గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీ పాలన విముక్తి కోసం పోరాటం

కల్లూరు, ఫిబ్రవరి 4: వైసీపీ పాలన విముక్తి కోసం పోరాడాలని జనసేన ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు స్పష్టం చేశారు. ఆదివారం కల్లూరు మండలం చిన్నటేకూరు, కల్లూరు అర్బన్ 32వ వార్డులో ఆయన జనసేన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఎన్నికల్లో టీడీపీ జన సేన నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్ర మంలో యాసపోగు బజారి, ముజఫర్‌నగర్ వార్డు ఇన్‌చార్జ్ సుదాకర్, జనసేన పార్టీ వీరమహిళ హసీనాబేగం, మంజునాథ్, షబ్బీర్, సతీష్, నాగరాజు, రఘు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 4: గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సర్పంచుల సంఘం కార్యదర్శి, నంద్యాల టీడీపీ ఉపాధ్య క్షుడు మోహన్ రెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఈకార్యక్రమానికి సర్పంచులంతా హాజరు కావాలని కోరారు.

ఆర్డీవో సేవలు అభినందనీయం


ఆర్డీవో దంపతులను సన్మానిస్తున్న డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్ సేవలు అభినందనీయమని డీఆర్వో మధుసూదన్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం హరిప్రసాద్‌ను మదనపల్లికి ఆర్డీవోగా నియమించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడారు. ఆర్డీవో హరిప్రసాద్ విధుల పట్ల అంకితభావంతో పని చేశారని, నిబద్ధత కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. తహసీల్దార్లను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వివాద రహితుడిగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. కోప తాపాలకు తావు లేకుండా అందరితో పని చేయించుకోగలిన సమర్థుడు అని చెప్పుకొచ్చారు. మదనపల్లిలో కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్డీవో హరిప్రసాద్ మాట్లాడుతూ అధికారులంతా సమష్టిగా పని చేశారని అన్నారు. సమన్వయంతో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్డీవో దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కల్లూరు, తహసీల్దార్లు శివరాముడు, టీవీ రమేష్ బాబు, విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలపర్చండి: సీపీఎం


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 4: సీపీఎంకు విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలను బలపరచాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ కోరా రు. ఆదివారం ఓర్వకల్లులో సీపీఎం మండల కార్యదర్శి నాగన్న ఆధ్వర్యం లో బృందం సభ్యులు ఇంటింటికీ తిరిగి విరాళాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిరంతరం రైతులు, కార్మికులు, సమస్యలపై పోరాడే సీపీఎంకు ప్రజలు విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలను ప్రోత్సహిస్తున్నరని కొనియాడారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపతున్నారన్నారు. రబీ, ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి, మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, షాలీబాషా, మాసూం బాషా, శ్రీరాములు, జగన్నాథం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు


సవారమ్మగుడి వద్ద ఉన్న మలుపు

సి.బెళగల్, ఫిబ్రవరి 4: మండల కేంద్రానికి సమీపంలోని సవారమ్మ గుడి దగ్గర ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారు. పలువురు గాయాల పాలయ్యారు. ఇక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు అనేకమార్లు అర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికా రులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధం: కిరణ్మయి


టీడీపీ నాయకుడిని సన్మానిస్తున్న కిరణ్మయి

కోడుమూరు, ఫిబ్రవరి 4: వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్మయి అన్నారు. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్ర ఆర్థికంగా ఇబ్బందిపడుతూ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె ఆదివారం వెంకటగిరి గ్రామానికి వెళ్లి చిన్న హోటల్ నడుపుకుంటున్న చంద్రను పలకరించారు. ఆయన కుటుంబ సభ్యులను కలిసి చంద్రను సన్మానించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలవాలంటే కార్యకర్తలు కష్టపడాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని, కాబట్టే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కంఠంలో మార్పు వచ్చిందని అన్నారు. టీడీపీ, జనసేన కూటమి అత్యధిక సీట్లలో గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ ఎంపీటీసీ సుజాత ఇంటికి వెళ్లి ఆమెను సన్మానించారు. అనంతరం గిడ్డాంజనే యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్మయి కుటుంబ సభ్యులు పూర్ణచంద్రరావు, తులసి, టీడీపీ నాయకులు మద్దిలేటి, గోపాల్, నారాయణ, సురేష్, వెంకటే శ్వర్లు, గిడ్డయ్య, బోసు పాల్గొన్నారు.

డీఎస్పీకి సత్కారం


డీఎస్పీ ఎస్‌డీ తేజేశ్వరరావును సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 4: జిల్లా పోలీసు శాఖలో సీఐగా పనిచేస్తూ ఇటీవల పదోన్నతిపై డీఎస్పీగా చిత్తూరుకు బదిలీ అయిన ఎస్‌డీ తేజేశ్వర రావును జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని మండలి కార్యాలయంలో, మండలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తేజేశ్వరరావుకు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛాలు అందజేసి జ్ఞాపిక ప్రదానం చేశారు. కార్యక్రమంలో దేవి ఫంక్షన్ హాలు అధినేత కొలుకుల చంద్రశేఖర్, మండలి రాష్ట్ర కార్యదర్శి కంచు గంటల శ్యామ్ సుందర్‌రావు, ఆపన్న ప్రదీ పన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగులవరం రాజశేఖర్, జిల్లా కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరాజు, బ్రాహ్మణ సంఘాల నాయకులు నొస్సం రామకృష్ణ, కరణం అనుజ్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 4: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో బీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూలు దేవదాయ ధర్మాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని, ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తులను అందజేయాలని ఆయన తెలిపారు. వివరాలకు ఈవోను సంప్రదించాలని సూచించారు.

తక్కువ ధరకే ఇంటర్నెట్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి అతి తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని ఏపీ ఫైబర్ నెట్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.190కే 6 నెలలు ప్యాకేజీ రీఛార్జ్ చేసుకుంటే 7 నెలలు, 12 నెలలు రీఛార్జ్ చేసుకుంటే 14 నెలలు వస్తుందన్నారు. కార్యక్రమంలో రవికిశోర్, అశోక్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

సి.బెళగల్, ఫిబ్రవరి 4: అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మన్మధవిజయ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ క్రిష్ణదొడ్డి, సి.బెళగల్, పోలకల్లు, సంగాల, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని కొండల్లో నుంచి ట్రాక్టర్ల యజమా నులు ఎర్రమట్టిని అనుమతి తరలిస్తున్నారని రైతులు ఎస్‌ఐ దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాత్రి సమయాలలో రౌడీషీటర్లు బయట కనబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారా బట్టీలపై దాడులు

కర్నూలు, ఫిబ్రవరి 4: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొలంపల్లి తాండా చుట్టుపక్కల ప్రాంతాల్లో నాటుసారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరేష్, పోలీసు సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సుమారు 9 సారా బట్టీలపై దాడులు చేసి 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

చౌరస్తా అంటే.. పద్మవ్యూహమే..


వాహనాలతో కిక్కిరిసిన బళ్లారి చౌరస్తా

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 4: కర్నూలు నగరంలో బళ్లారి చౌరస్తా సర్కిల్‌లో రోజురోజుకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయి ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. కొత్తబస్టాండు నుంచి బళ్లారి చౌరస్తా సర్కిల్‌కు చేరుకోవాలంటే.. వాహనాలను దాటుకుని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని నడ వాల్సిన పరిస్థితి నెలకొంది. పద్మవ్యూహాన్ని దాటుకుని బళ్లారి చౌరస్తాను చేరుకోవాలంటే.. దాదాపు గంటకు పైగానే సమయం పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ఆరువైపుల నుంచి వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. కర్నూలు సిటీ నుంచి కోడుమూరు వైపు, అటువైపు నుంచి కర్నూలు సిటీలోకి వాహనాల రాకపోకలు ఎక్కువై పోతున్నాయి. మరోవైపు బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల నుంచి నగరం లోకి వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. ఈ వాహనాల రాకపోకలను నియంత్రించే క్రమంలో పోలీసులు కుస్తీ పడుతున్నారు.

జూనియర్ హాకీ జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 4: కర్నూలు జిల్లా నుంచి జూనియర్ హాకీ జట్టును హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్ ప్రకటించారు. జూనియర్ మహిళల జట్టు కర్నూలు నుంచి అక్షయ రేచల్ రాణి, రేణుక, నేహరాణి, నేహ తబుస్సుం. నంద్యాల నుంచి మౌనిక, శ్రీలత, రాధిక, సీమ, పావని హిమబిందు, ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 12 వరకు శ్రీకా కుళంలో జరిగే 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మహిళల అంతర్ జిల్లా హాకీ పోటీలను పాల్గొంటారనీ తెలిపారు. వీరు 7న మధ్యాహ్నం 3 గంట లకు, కర్నూలు స్టేడియంలో రిపోర్టు చేయవలసిందిగా తెలియజేశారు.

సబ్ జూనియర్ బాలుర జట్టు: కర్నూలు నుంచి నాగేంద్ర, రాఖి, రాజు, అర్పిత్ జాన్, చరణ్, ప్రశాంత్, ఎమ్మిగనూరు నుంచి రామ్‌చరణ్ ఆదోని నుంచి విశ్వనాథ్, నంద్యాల నుంచి అరవింద్,సమీర్ వంశీ, అభినయ్, పృథ్వీ సాయి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 10 నుంచి 12 వరకు హాకీ కర్నూలు ఆధ్వర్యంలో జరిగే 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం


గోరంట్ల వద్ద హంద్రీలో పారుతున్న నీరు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 4: మండలంలోని గోరంట్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో సుమారు ఇరవై రోజులకు పైగా తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్థుల వినతి మేరకు జీడీపీ నీటిని ఆదివారం వర్కూరు సుద్దవాగు మీదుగా హంద్రీనదికి విడుదల చేశారు. హంద్రీనదిలో ప్రవహించిన నీరు గోరంట్ల వద్దకు చేరుకుంది. దీంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి తీరడంతో టీడీపీ నాయకులు టీఎన్‌టీ యూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు, మాజీ సర్పంచ్ పరమేశ్వరనాయుడు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఆడ్వాణీ ఎంపిక అభినందనీయం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 4: లాల్‌కృష్ణ ఆడ్వాణీకి కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ప్రకటించడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశభక్తుడిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించిన ఆడ్వాణీ... రథయాత్రతో రామమందిర నిర్మాణానికి అంకురార్పణ చేసిన మహనీయుడని, ఆయనకు ఈ పురస్కారం ఇవ్వడం అభినందనీయం అన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



పోస్టర్లు అతికిస్తున్న ఉపాధ్యాయులు

మద్దికెర, ఫిబ్రవరి 4 : సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అలా అమలు చేసిన వారికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో తమ కుటుంబాల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ నాయకులు ఎన్‌జీ నాగరాజు, విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మద్దికెర గ్రామంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను తమ ఇళ్లను మెయిన్‌బజారులో అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చినహామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలుకు స్పష్టమైన హామీ ఇచ్చే పార్టీకి ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి



అధ్యాపకులతో వాగ్వావాదం చేస్తున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 4: ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ఓ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కళాశాలలో నిర్వహిస్తున్న తరగతులను ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. తరగతులు ఎలా నిర్వహిస్తారంటూ అధ్యాపకులతో, ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఇంటర్మీడియట్ ఆర్ఐవో పట్టించుకోకపోవడం వల్లనే తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, విష్ణు, హరికృష్ణ మహేష్, హోసన్నా రాజు, గణేష్, వీరాంజి, చంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 4: ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, రాజు, నాగరాజు, మునీంద్ర కోరారు. ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో మృతి చెందిన కార్మిక కుటుంబంలో ఆధార్, రేషన్ కార్డు ఆధారంగా ఒకరికి ఉద్యోగం కల్పించేవారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ విధానానికి స్వస్తి పలికారన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం కల్పించాలని మున్సిపల్ కౌన్సిల్ 2023లో తీర్మానం కూడా జరిగిందన్నారు. అయితే అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించకపోతే దశలవారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యు. లక్ష్మన్న, జయరాజు, ప్రసాద్, రంగస్వామి, మారెమ్మ లు పాల్గొన్నారు.

ఎంపీ సీటు బీసీలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి

తుగ్గలి, ఫిబ్రవరి 4: కర్నూలు పార్లమెంటు సీటు బడుగు బలహీన వర్గాల వారికి కేటాయించాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాభాషా అన్నారు. ఆదివారం చెన్నంపల్లిలో వారు మాట్లాడుతూ కర్నూలు ఎంపీ సీటును బీసీలకు కేటాయించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడుకు ఇవ్వాలని, ఈ ప్రాంతంలో కురువ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని, టీడీపీ తరపున ఎంపీ టికెట్ బత్తినకు ఇస్తే అన్ని వర్గాలు టీడీపీని గెలిపిస్తారన్నారు.

హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం



వగరూరులో హెల్త్ క్లినిక్ భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం పంచాయతీరాజ్ డీఈ అశ్వత్థామ, ఏఈఈ నరసింహులు, మండల వైద్యాధికారి గోవిందమ్మ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్యం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, దశరథరెడ్డి, వీరారెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, వీరనాగన్న, మధుసూదన్ రెడ్డి, వలి, ఎస్‌బి వేణుగోపాల్ రాజు, ఎలిజబెత్, కాంతరెడ్డి పాల్గొన్నారు.


వెల్లుల్లికి భలే డిమాండ్

● కేజీ రూ.400



ఆలూరు, ఫిబ్రవరి 4: వెల్లుల్లి పాయల ధర కేజీ రూ.400 పలుకుతోంది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వెల్లుల్లిపాయలను బళ్లారి, ఆదోని, గుంతకల్లు నుంచి దిగుమతి చేసుకోవాలి. అయితే వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పచ్చిగా ఉన్నప్పుడు బరువు ఎక్కువగా ఉండడంతో ధర పెరుగుతుందని, విక్రయానికి తెచ్చాక ఎండిపోతే బరువు తగ్గి నష్టం జరుగుతుందని వ్యాపారులు అంటున్నారు. కేజీ రూ.250 ఉన్న ధర అమాంతంగా పెరగడంతోపాటు దుకాణాల్లో కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ముందుకు సాగని హంద్రీ నీవా



పనులు పూర్తికాకపోవడంతో అడ్డగోలుగా పారుతున్న నీరు

● ఐదేళ్లగా విస్మరణకు గురైన పనులు
● జగన్ ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం

దేవనకొండ, ఫిబ్రవరి 4 : కృష్ణ జలాలతో కరువు పీడిత రాయలసీమ ప్రజల గొంతులు తడపాలని, పొలాలు పండించాలని చేపట్టిన హంద్రీ నీవాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. తనది రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే జగన్ ప్రభుత్వం హంద్రీనీవాకు మాత్రం ఐదేళ్లలో చేసింది శూన్యం. 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం హంద్రీనీవా పనులు పూర్తి చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించారు. ఆనాడు టీడీపీ ప్రభుత్వం చేసిన పనులే తప్ప నేటి ప్రభుత్వంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడిన దాఖలాలు లేవు. రైతుల పొలాలకు నీరందించాలని గత ప్రభుత్వం శరవేగంగా పనులు జరిపించింది. దానితో పోల్చుకుంటే నేటి ప్రభుత్వానికి వ్యవసాయం, ప్రాజెక్టుల పైన చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. హంద్రీనీవా పనులు గత ప్రభుత్వంలో 70 శాతం మేర పనులు పూర్తి చేశారు. ఇంకా దాదాపు ముప్పై శాతం మేర పెండింగ్ పనులు ఉన్నాయి. ఇవి పూర్తి అయితే రైతులకు హంద్రీ నీవా సాగునీరు పుష్కలంగా అదుతోంది. పందికోన రిజర్వాయర్ పరిధిలో కుడి కాలువ కింద దేవనకొండ మండలంలో దాదాపు 51 వేలు, ఎడమ కాలువ కింద పత్తికొండ మండలంలో 13.5 వేల ఎకరాలకు హంద్రీనీవా ద్వారా సాగునీరు రైతుల పంటపొలాలకు అందాల్సి వుండగా అధికారికంగా కుడి, ఎడమ కాలువల కింద దాదాపు 20 వేల ఎకరాలు సాగునీరు అందుతుంది. ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కుడి, ఎడమ కాలువ పరిధిలోని పిల్లకాలువలు, గేట్లు నిర్మాణ పనులు ఒక్కటి కూడా మొదలు కాకపోవడంతో రైతులకు హంద్రీ నీవా సాగు నీరందకుండా ప్రభుత్వం చేసింది. ఐదేళ్ల పాటు ఎలాంటి పనులు చేయకపోవడంతో ప్రధాన కాలువల్లో మొక్కలు పెరిగి చెట్లుగా మారాయి. కాలువలలో జమ్ము ఏపుగా పెరిగింది. నిర్వహణ లోపంతో నీటి పంపిణీ సక్రమంగా జరగడం లేదు. కొన్ని చోట్ల కాలువ పక్కన ఉన్న పొలాల్లో సైతం హంద్రీ నీవా నీరు పారి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభుత్వ పాలనలో హంద్రీనీవా పూర్తిస్థాయిలో వివక్షకు గురైంది.



నిర్వహణ లోపంతో కాలువ గట్టు పై ఏపుగా పెరిగిన చెట్లు

ఐదేళ్లలో పనులే జరగలేదు



ఐదేళ్లలో హంద్రీనీవా పెండింగ్ పనులు చేపట్టకపోవడంతో వేలాది రూపాయలతో డీజిల్ మోటార్లతో పంటలు సాగు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో జరిగిన పనులే తప్ప ఈ ప్రభుత్వం హంద్రీ నీవా పనులు ఏమీ చేయ లేదు.

- బండల రామాంజనేయులు, రైతు దేవనకొండ :

ప్రతిపాదనలు పంపాం

హంద్రీనీవా పెండింగ్ పనులు పిల్ల కాలువలు, డిస్ట్రిబ్యూటరీ గేట్లు తదితర పనుల కోసం రూ.168 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

- గోపీనాథ్ డీఈ పత్తికొండ

ఐదేళ్లలో అవినీతి రాష్ట్రంగా మార్చారు

● మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి



మిరప రైతు కష్టాలను అడిగి తెలుసుకుంటున్న బీవీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 4: వైఎస్ జగన్ ఐదేళ్ల పాలపలె రాష్ట్రాన్ని అవినీతి మయం చేశారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం కులమాల గ్రామంలో పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో మాట్లాడారు. అలాగే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీవీ మాట్లాడుతూ బీసీల ప్రేమ ఎన్నికల సమయంలో మాత్రమే సీఎం జగన్‌కు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణలలో మొదటి స్థానం ఉంటే.. జగన్‌రెడ్డి పాలనలో గంజాయి, అక్రమ మద్యం, భూమాఫియా, ఇసుక మాఫియాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. విచ్చలవిడిగా గంజాయి అమ్ముతుండడంతో యువత జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. గత ఎన్నికల ముందు మెగా డీఎస్సీ రిలీజ్ విడుదల చేస్తానని మాట ఇచ్చి నిరుద్యోగులను వంచించి మోసగించాడని మండిపడ్డారు. రాష్ట్రంలో వనరులను దోపిడీ చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పి టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడం ఖాయమని కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, కులుమాల రాముడు, చాంద్‌బాషా, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, గోనెగండ్ల రమేష్‌నాయుడు, బారతం రహంతుల్లా, రంగస్వామినాయుడు, రఫీక్, నూరహమ్మద్, ఫకృద్దీన్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాట ధర కల్పించాలి:

రైతులు పండించి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. కులుమాల గ్రామంలో మిరప పంటను పండించి ఆరవేసుకున్న రైతు కష్టాలను అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధర కరువైందని, ఎరువుల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయని రైతులు బీవీకి వివరించారు. త్వరలోనే టీడీపీ ప్రభుత్వం రాగానే రైతుల కష్టాలన్నీ తీరుతాయని భరోసా ఇచ్చారు.

● పెద్దమరివీడు గ్రామంలో ఆదివారం దస్తగిరయ్యస్వామి ఉరుసు భక్తులు, గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సేవకుడు అయ్యన్న

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య



వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఐ నేత రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4: ప్రజాసేవకుడు అయ్యన్న ఆశయ సాధన కోసం పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం పత్తికొండ మండలం పందికోన గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు, సీపీఐ మాజీ మండల కార్యదర్శి అయ్యన్న 9వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా అయ్యన్న ఇంటి దగ్గర నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, సానుభూతి పరులు ర్యాలీగా బయలుదేరి అయ్యన్న స్థూపం దగ్గరకు చేరుకున్నారు. అనంతరం అయ్యన్నస్థూపం దగ్గర పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ, వైసీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ పందికోన గ్రామంలో దొరల పెత్తందారుల విధానాలను ఎదురించి ప్రజలకు విముక్తి కలిగించిన గొప్ప నాయకుడు అన్నారు. గ్రామం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ పూర్వ కార్యదర్శి భీమలింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి రాజాసాహెబ్, సహకార కార్యదర్శి కాశీం, అయ్యన్న తనయుడు చంద్ర, రవికుమార్, టీడీపీ వైసీపీ మండల కన్వీనర్లు కడవల సుధాకర్, కారం నాగరాజు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, సీపీఐ ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, కారన్న, వీరన్న, గుండుబాషా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టును పరిశీలించండి

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 4: గ్రామాల్లో ఓటర్ లిస్టును పరిశీలించుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్, భూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ నాయకులకు సూచించారు. ఆదివారం కంబాలపాడు గ్రామంలో కర్నూలు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ, ఓటర్ వేరిఫికేషన్‌లో భాగంగా క్లస్టర్ యూనిట్,బూత్ ఇన్‌చార్జి, తెలుగుదేశం పార్టీ గ్రామ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాలలో ఓటర్ లిస్టులో పేర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు బోయ బొంతిరాళ్ళ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టికంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో స్వీపర్లు, స్కావెంజర్ల సమావేశం సుంకమ్మ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ స్కావెంజర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం అరకొర వేతనాలు ఇవ్వడం సరైంది కాదన్నారు. వీరికి పనిభారం పెరిగిందని, ప్రభుత్వం గుర్తించి రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చేతి వృత్తుల దారుల సంఘం కార్యదర్శి కారన్న, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు నాగయ్య, దూదెకొండ ఎంపీటీసీ వీరన్న, సంఘం నాయకురాలు లక్ష్మీదేవి, అనిత పాల్గొన్నారు.

ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం



మాట్లాడతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం, ఫిబ్రవరి 4: త్వరలో జరిగే ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని ఆదోని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. ఆదివారం రాత్రి మండలంలోని మాలపల్లి గ్రామంలో సీఐ ఎరిషావలి, ఎస్ఐ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా ఎలాంటి గొడవలు లేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మాలపల్లి సర్పంచ్ సీతారామిరెడ్డి తదితరులు ఉన్నారు.

వాల్మీకి మహా పాద యాత్రను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 4: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 8న చేపట్టిన మహా పాదయాత్రను జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు దేవేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దకడుబూరులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వాల్మీకి విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. వాల్మీకులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప తమకు న్యాయం చేయడం లేదన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. పెద్ద తుంబళం నుంచి ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు అంజనేయులు, గణేష్, రామాంజనేయులు, విరుపాక్షి, గోపాల్, తిక్కన్న, వీరేష్, సత్యన్న, గోవిందు, రంగన్న, మొట్రు తిక్కన్న, రంగస్వామి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

మద్దికెర, ఫిబ్రవరి 4 : విజయనగరం జిల్లా కొండేపల్లి తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడం దారుణమని ఆదోని రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు నాగరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌ను హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భూ వివాదాలు ఉన్న మండలాలుగా రెవెన్యూ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు.

మెగా డీఎస్సీ ఎన్నికల జిమ్మిక్కే.



మాట్లాడుతున టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

మద్దికెర, ఫిబ్రవరి 4 : ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్ రెడ్డి నిరుద్యోగ యువతను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని తెలుగునాడు సమైఖ్య విద్యార్థి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఆరోపించారు. ఆదివారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాలులో టీడీపీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇంత కాలం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు కుట్రలు పనుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు వైసీపీకి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పారా విఠోభ, మాజీ ఎంపీటీసీలు సుధాకర్‌చౌదరి, ఆనంద్, శివశంకర్, మాజీ సర్పంచ్ వర్మ, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రాము యాదవ్, సాగినగర్‌బాషా, చంద్ర, ఐటీడీపీ ఆలూరు తాలుకా అధ్యక్షులు రామాంజనేయులు, హరినాథ్ తదితరులు ఉన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపడం ఖాయం



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపడం ఖాయమని టీడీపీ సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ చంద్రబాబు రా.. కదిలిరా సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి వైసీపీ నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఈ ప్రభుత్వంలో పేదలు మూడు పూటల తిండితినే పరిస్థితి లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో పేద, మధ్యతరగతి వారు గగ్గోలు పెడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పేదరికాన్ని నిర్మూలిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు రైతులకు, యువతకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

టీడీపీ-జనసేన పొత్తుతో ముందుకు సాగుతాం



జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న లక్ష్మన్న, టీడీపీ కార్యకర్తలు

మంత్రాలయం, ఫిబ్రవరి 4: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తుతో ముందుకు సాగుతామని మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో జనసేన మండల నాయకులు ఏసేపు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు లక్ష్మన్న మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి టీడీపీ జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గోపాల్, రాజేష్, వీరారెడ్డి, ప్రసాద్, రాజు, బీవీ రవిచంద్ర, నరసింహులు, టీడీపీ నాయకులు నాగేంద్ర, రామాంజనేయులు, బొజ్జప్ప, చిదానంద, నారాయణ, ఈరప్ప పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్ఏవీఎఫ్ నాయకులు

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 4: బీసీ హాస్టల్‌లో సరైన సౌకర్యాలు కల్పించలేని హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆర్ఏవీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దకడుబూరులోని ఆర్ఏవీఎఫ్ నాయకులు హాస్టల్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ కరువుతో తల్లిదండ్రులు వలసలు వెళ్లి విద్యార్థులను హాస్టల్‌లో వదిలితే వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. హాస్టల్‌లో నాలుగు నెలల నుంచి విద్యార్థులకు గుడ్డు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

పోరాటల ద్వారానే సమస్యలు పరిష్కారం

గోనెగండ్ల, ఫిబ్రవరి 4: పోరాటల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆనంద్‌బాబు అన్నారు. ఆదివారం గోనెగండ్లలో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసకువెళ్లి సమస్యలను పరిష్కరించి ప్రజా పక్షాన సీపీఎం నిలబడుతుందని అన్నారు. సీఎం జగన్ ప్రజపాలన అందించడంలో విఫలమయ్యారన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విరాళాలను సేకరించే కార్యక్రమంలో భాగంగా వారు గోనెగండ్లలో విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, దేవేంద్ర, మారేష్ పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ భవనం కూల్చివేత

మంత్రాలయం, ఫిబ్రవరి 4: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం స్వాధీనం చేసుకున్న ఆర్‌అండ్‌బీ భవనంను ఆదివారం కూల్చివేశారు. రాఘవేంద్ర సర్కిల్లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఆర్‌అండ్‌బి భవనంతో పాటు సర్వే నెం.64/1 లోని 1.19 ఎకరాలు భూమికి బదలు సర్వే నెం.11/3 లోని 1.55 ఎకరాలు భూమిని ఆర్‌అండ్‌బి కి ఇచ్చి ఇరువురు ఒప్పందంతో గత నెల 30న శ్రీమఠం అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు బదలాయింపు రిజిస్ట్రేషన్ చేసుకొన్న విషయం తెలిసిందే. శ్రీమఠం స్వాధీనంలో ఉన్న ఆర్‌అండ్‌బీ భవనాన్ని తొలగింపు పనులు చేపట్టారు. ఈ స్థలంలో భక్తులకు మెరుగైన సౌకర్యార్థం పార్కింగ్, లాకర్లు, వసతి వంటి అభివృద్ధి పనులకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీకారం చుట్టనున్నారు.

రూ.2 లక్షల రుణం మాఫీ చేయాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4: వరుస కరువు కాటకాలతో ఆర్థికంగా చితికిపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇంత వరకు ఎలాంటి కరువు సహాయ చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టరేట్‌ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వీరన్న, ఉమాపతి, తిమ్మయ్య, కారన్న, వీరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.